# 'కోహం' అని పుట్టినవాడు 'సోహం' అనే అనుభూతిని పొందినప్పుడే జీవితము సార్థకమవుతుంది

నవనవోజ్వల శిల్పనైపుణ్య ధోరణి
తనరారు లలిత సౌందర్యరాశి

శిల్పకళా పరిచిత్రితంబగు వర్ణ
దీపికల్ చిందెడి దివ్యకీర్తి
కోటి శిల్పులతోడ కొంగుబంగారైన
భవ్య దివ్యస్ఫూర్తి ప్రాభవంబు
ప్రాచీన మందిర వాస్తుశాస్త్రస్ఫూర్తి
భూనభో వ్యాప్తి సమర్చితంబు
శుభముహూర్తాన మంగళసూచకముగ
తరలి భారతదేశ ప్రధానమంత్రి
విశ్వకళ్యాణ భవనమావిష్కరించె
సర్వజన మాన్య నరసింహ సార్వభౌమ!

తల్లిగర్భమునుండి జన్మించినపుడు
కంఠమాలలనేవి కానరావు

sri sathyasaivachanamrutam

**మంచి ముత్యపు సరుల్ మచ్చునకు లేవు**
**మేల్మి బంగరుదండ మెడకు లేదు**
**రత్నాల హారముల్ రంజిల్లగా లేవు**
**పచ్చలు కెంపులు పొదగలేదు**
**వజ్రాల హారముల్ వర్థిల్లగా లేవు**
**గోమేధికంబులు తోడలేవు**
**కలదు కలదొక్క మాల మీ కంఠమందు**
**ఎన్ని చేసిన అవియన్ని ఎంచి ఎంచి**
**మంచియైనను చెడుగైన త్రుంచకుండ**
**బ్రహ్మ మీకిచ్చి పంపును బరువుమాల**
**కర్మలన్నియు చేర్చిన కంఠమాల.**

దివ్యాత్మ స్వరూపులారా!

భారతీయ సంస్కృతి అత్యున్నతమైనటువంటిది. అనుపమానమైనటువంటిది. కాలముచే మారక, చరిత్రచే మాయక, తరుగక, సృష్టిచే పెరుగక ఏ సత్యమైతే ఉన్నదో ఆ సత్యమునకు రూపకల్పనయే భారతీయ సంస్కృతి. ఈ భారతీయ సంస్కృతియొక్క అంతరార్థమే సనాతన ధర్మము. ఆ సనాతన ధర్మముయొక్క మారు రూపమే కర్మ. కర్మ యిట్టిది అట్టిది అని ఎవరూ నిర్ణయించలేరు. ఏది, ఎప్పుడు, ఎక్కడ, ఏ విధముగా చేయునో గ్రహించుట సాధ్యము కాని విషయము. యిట్టి కర్మతత్త్వము జగత్తంతయు వ్యాపించి ఉన్నది. భారతీయులయొక్క వాఙ్మయము వేదము.

**మానవుడు కర్మచేత కట్టుబడి ఉంటున్నాడు**

వేదము త్రికాండస్వరూపము. మొదటి కాండ కర్మయోగమే! జ్ఞానమార్గమును బోధించే నిమిత్తమై ఉపనిషత్తులు ఆవిర్భవించాయి. ఉపనిషత్తులుకూడను యోగత్రయములు. అందులోకూడను మొదటిది కర్మయే! ఈ యోగత్రయములందుగానీ,

srisathyasaivachanamrutam

కాండత్రయములందుగానీ కర్మకు ప్రధానస్థానము యివ్వటములో ఉండిన అంతరార్థము యేమిటో గుర్తించాలి. మానవత్వములో సృష్టిస్థితిలయములన్నీ కర్మచేతనే కట్టబడి ఉంటున్నవి. మానవుడు అనుభవించే సుఖదుఃఖములు, ఆచరించే పాపపుణ్యములు, అందుకునే నిందాస్తుతులు కర్మయొక్క ప్రసాదములే! మానవత్వము అనేది 'కర్మానుబంధీని మనుష్యలోకే.' కర్మచేతనే కట్టబడి ఉంటున్నాడు, మానవుడు. ఈ రహస్యమును గుర్తించలేక మానవుడు కర్మను ఆచరించు సమయమునందు ఆనందముగా ఆచరిస్తున్నాడు; కానీ, ఫలితము అనుభవించే సమయములో విచారముగా అనుభవిస్తున్నాడు. కనుక, ప్రతి మానవుడు కర్మను ఆచరించుటకు పూర్వము ఉపనిషత్ వాక్యమును పురస్కరించుకుని మొట్టమొదట కర్మకు నమస్కారం చేయమన్నారు. ఏ విధంగా? 'కర్మానుబంధీని మనుష్యలోకే.' ప్రతి మానవుడు ఈనాడు కర్మఫలమును ఆశించే కర్మలాచరిస్తున్నాడు. ఫలమును అనుభవించే నిమిత్తము కాయమును ధరిస్తున్నాడు. 'తస్మై నమఃకర్మణే' అన్నారు. అనగా నాకు మంచికర్మలు చేయటానికి తగిన శక్తిసామర్థ్యములు ప్రసాదించమని భగవంతుని ప్రార్థించటమే!

**కర్మయొక్క అంతిమస్వరూపమే ఫలము**

మనము చేసే ప్రతి కర్మయందు ఫలమనేది యిమిడి ఉంటున్నది. చిన్న విత్తనము. ఆ విత్తనములో భవిష్యత్తులో రూపు దిద్దుకునే విశాల వృక్షము యిమిడి ఉన్నది. ఆ వృక్షములో కొమ్మలు గానీ, రెమ్మలు గానీ, కాయలు గానీ, ఫలములు గానీ అవన్నియు విత్తనముయొక్క మారు రూపములే! ఐతే విత్తనము మనము భూమిలో నాటిన తరువాత కొంతకాలమునకు అది ఒక వృక్షముగా అభివృద్ధి అవుతున్నది. ఈ వృక్షము ఎక్కడనుండి వచ్చింది? 'బీజం మాం సర్వభూతానాం.' ఈ ప్రపంచమంతయు కర్మఫలమనే బీజమునుండే ఆవిర్భవిస్తూ వచ్చింది. కర్మ వేరు, కర్మఫలము వేరు కాదు. కర్మయొక్క అంత్యస్వరూపమే ఫలము. ప్రతిదానికి కూడను ఆది, అంత్యము ఉంటున్నాయి. సుఖదుఃఖములుకూడను ఆది అంత్యములే!

**కష్టసుఖములు రెండును కలసియుండు**
**వాని విడదీయ నెవరికి వశముగాదు**

srisathyasai vachanamrutam

**సుఖము ప్రత్యేకముగ నెందు చూడబోము**
**కష్టము ఫలించెనేని సుఖంబటండ్రు.**

రెండుకాదు యివి, ఒక్కటే! 'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ' అని. మానవత్వములో యిట్టి దివ్యత్వము, పవిత్రము ఉండటంచేతనే 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు. అట్టి దుర్లభమైన మానవజన్మ ఎత్తి కూడను భారతీయ సంస్కృతియొక్క విశిష్టతను గుర్తించుకోలేకపోవటము యిది నిజముగా దురదృష్టమనే చెప్పవచ్చును. మొట్టమొదట భారతీయ సంస్కృతియొక్క విశిష్టతను మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. కర్మ ఎక్కడనో కాదు.

**దేవుడనగ వేరు దేశమందున లేడు**
**దేవుడుండు తనదు దేహమందె**
**పాపమనగ వేరు పరదేశమున లేదు**
**తానుచేయు పనుల తగిలియుండు**

**కర్మమార్గమన్న కమనీయ పుష్పము**
**భక్తిమార్గమన్న పచ్చికాయ**
**జ్ఞానమార్గమన్న చవులూరు ఫలమయా!**

ఈ మూడు ప్రత్యేకము కాదు. పూవు లేక కాయ కాలేదు. కాయ లేక ఫలము కాలేదు.

**పువ్వు లేక కాయ పుట్టదు చెట్టున**
**కాయ లేక ఫలము కలుగబోదు**
**కర్మనిష్ఠ లేక కలుగదు భక్తియు**
**భక్తి లేక జ్ఞాన భరితుడగున!**

జ్ఞానియందు జ్ఞానతత్త్వముకూడను కర్మయొక్క ఫలమే! కర్మయొక్క తత్త్వమును భారతీయులు చక్కగా గుర్తించినవారు. ఈ కర్మ రహస్యమును భారతీయులు తప్ప అన్యులు ఎవరూ యింత సులభముగా గుర్తించలేరు. కనుకనే భారతదేశమునకు 'కర్మభూమి' అని

srisathyasaivachanamrutam

మరొక పేరు. అట్టి పవిత్రమైన, దివ్యమైన, నవ్యమైన, భవ్యమైన యీ కర్మభూమియందు జన్మించిన భారతీయులు తమ సంస్కారతత్త్వాన్ని తాము గుర్తించుకోలేకపోతున్నారు.

**భవ్యభావాలు కల్గిన భారతీయ**
**దివ్యసంస్కృతి తత్త్వంబు తెలిసికొనగ**
**భారతీయులె యత్నింపనేరరైరి**
**ఇంతకంటెను దౌర్భాగ్యమేమి కలదు?**

మన సంస్కృతితత్త్వాన్ని మనం గుర్తించుకోటానికి తగిన ప్రయత్నం చేయటం లేదు. మన సంస్కారమును, మన సంస్కృతిని, మన తత్త్వాన్ని మనం గుర్తించటానికి ప్రయత్నించాలి.

**ఉత్తమమైన కర్మలు ఆచరించి ఉత్తమమైన ఫలములు అందుకొని ఆదర్శవంతమైన జీవితమును అందించాలి**

ప్రేమస్వరూపులారా! ప్రతి ఒక్కటికూడా కర్మఫలమే! మీరు నమ్మినా, నమ్మకపోయినప్పటికిని సృష్టిస్థితిలయములకు కర్మయే కారణము. ఒక చిన్న ఉదాహరణము. ఆకలి వేస్తుంది. అన్నం తింటే ఆకలి తీరుతుంది. ఐతే యీ కర్మకు, ఆకలి తీర్చుకునే ఫలితమునకు మధ్యలో గొప్ప పరిణామము ఉంటున్నాది. ఏమిటి ఆ పరిణామము? అన్నం నోట్లో పెట్టుకోవాలి. దంతములతో బాగుగా నమలాలి. గొంతుతో మ్రింగాలి. ఆయా స్థాయిలో అది చేరుకున్న తరువాతనే ఆకలి మనకు తీరుతున్నాది. తినటమనేది కర్మ. ఆకలి తీరటమనేది ఫలము. కర్మకు, కర్మఫలమునకు మధ్య ఎంతో పరిణామము జరుగుతున్నాది. ఆ పరిణామము నేడు కావచ్చు, పది సంవత్సరములు కావచ్చు, పది జన్మలు కావచ్చుగానీ కర్మఫలము తప్పినది కాదు. కనుక, మనము యీ కర్మను సక్రమమైనదానిగా చేయాలి. ఉత్తమమైన కర్మలు ఆచరించి ఉత్తమమైన ఫలములు అందుకొని దేశానికి ఆదర్శవంతమైన జీవితమును అందించాలి. సౌభ్రాతృత్వము, సౌశీల్యము, సమగ్రత యిలాంటివి మానవత్వములో ప్రధానమైన విలువైన గుణములు. యిలాంటి గుణములయొక్క తత్త్వాన్ని మనం గుర్తించుకోటానికి తగిన ప్రయత్నము చేయటం లేదు. ఒక చెరువులో ఒక రాయిని వేశాము. వేసిన తక్షణమే అల ప్రారంభమైంది.

srisathyasaivachanamrutam

ఆ అల అక్కడతో నిలువలేదు. చెరువంతా వ్యాపించిపోతుంది. మనకు కనుపించినా, కనుపించకపోయినా చెరువంతాకూడను ఆ అల వ్యాపించి ఉంది. అదే విధముగనే మన మానస సరోవరములో చెడ్డ భావము లేక మంచి భావము అనే సంకల్పము పడినప్పుడు అది దేహమంతా వ్యాపించిపోతుంది. అది మంచి సంకల్పమే అయితే మన చేతులతో మనం మంచి పని చేస్తాం. నోటితో మంచి మాటలాడుతాం. కన్నులతో మంచి దృశ్యాన్ని చూస్తాము. అదే చెడ్డదైనప్పుడు మన చేతులతో చేసే పనులుగానీ, నోటితో ఆడే మాటలు గానీ, కన్నులతో చూచే దృశ్యముగానీ, చెవులతో వినే శ్రవణముగానీ అన్నీ చెడ్డగానే మారిపోతాయి. యీ విధమైన ఆదర్శములు, ఆధారములను గురించి మన పవిత్రమైన చరిత్రలు ఎంతో చాటుతూ వచ్చాయి. అనాదికాలమునుండి యిట్టి పవిత్రమైన మానవ జీవితమునకు ఉత్తమమైన మార్గమును, రాజమార్గాన్ని నిర్మించిన మహర్షులు ఆచరణ రీతిలో ప్రచార ప్రబోధలు సలుపుతూ వచ్చారు. యీనాడు అట్టి ఆచరణరూప ప్రచారములు లేక బ్రహ్మతత్త్వమును గురించిగానీ, కర్మతత్త్వమును గురించిగానీ, ధర్మతత్త్వమును గురించిగానీ కేవలము ప్రచార, ప్రబోధములు మాత్రమే జరుగుతూ ఉన్నాయి. ఆచరణ లేకపోవటంచేత అన్ని విధాలా మనము యీ ఆనందానికి దూరమైపోతున్నాము. పదార్థశాస్త్రమును పురస్కరించుకొని మరొక రీతిగా మనము చూచుకుంటే అసలు కర్మఫలమనేది మనకు ఉన్నదా లేదా అని సందేహించనక్కర లేదు. ఒక అద్దముముందు పోయి నీవు నిల్చుకో! అద్దముముందు నిల్చుకొని ఆ ప్రతిబింబమునకు నీవు నమస్కారము చేయి. ఆ ప్రతిబింబము తిరిగి నీకు నమస్కారము చేస్తున్నాది. అద్దముముందు నిల్చుకొని ఆ ప్రతిబింబమును నీవు దండించు. అది నిన్ను తిరిగి దండిస్తున్నాది. అద్దముముందు నిల్చుకొని ఆ ప్రతిబింబమును హాస్యము చేయి; అదికూడ నిన్ను హాస్యము చేస్తుంది. కాబట్టి అంతా **reaction, reflection, resound.** మరొక్కటి. 'ఈ టేబులును నేను గట్టిగా కొట్టాను,' అని నీవు అనుకుంటావు. గట్టిగా కొట్టినానని చాలా అహంకరిస్తున్నావు. కాదు కాదు, ఆ టేబులుకూడా నిన్ను అంత గట్టిగా కొట్టింది. అది నీవు మరచిపోతున్నావు. ప్రతి విషయమునందు యీ కర్మఫలమనేది భారతీయులకు చాలా ప్రధానమైన అంశము. ఈ కర్మఫలమనే మాలను ధరించే మనమందరము జన్మిస్తున్నాము. కానీ మాలను

srisathyasaivahini.org

మర్చిపోతున్నాము. మన స్వభావమును విస్మరించి, ప్రభావాన్ని ఆశించి, కేవలము జీవితమును వ్యర్థము గావించుకుంటున్నాము. ప్రభావమును మనము ఆశించటంచేతనే మన స్వభావము క్షీణించిపోతున్నది. స్వ-భావము అనగా ఆత్మభావము. స్వాతంత్ర్యము అదే స్వతంత్రము. స్వతంత్రమనగా యిష్టానుసారము చేయటము, యిష్టానుసారము ప్రవర్తించటము కాదు. స్వాతంత్ర్యము అనగా ఆత్మతంత్రమే! అట్టి conscienceను మనము అనుసరించాలి.

**ఈనాడు మనము అనేకత్వములో ఉన్న ఏకత్వమును గుర్తించాలి**

ప్రేమస్వరూపులారా! ప్రపంచములో జరుగుతున్న యీనాటి అశాంతులకు, అల్లకల్లోలములకు, భీతులకు మన కర్మలే కారణము. మరొకటి కానే కాదు. ఎవరో దీనికి కారణమని కేవలము మన బలహీనతవల్ల వారిపైన నేరములు, నిందలు మోపుతున్నాము. కానీ, ఎవ్వరూ కారణము కాదు. ఎవరు చేసిన కర్మము వారిదే! ఫలితము ఆ రీతిగానే ఉంటుంది.

**ఎవరు చేసిన కర్మ వారనుభవింపక ఎవరికైనను తప్పదన్నా**
**ఏనాడు ఏ తీరు ఎవరు చెప్పాగలరు అనుభవించుట సిద్ధమన్నా**

ఈ సత్యాన్ని మనము యీనాడు గుర్తించుకుంటే ద్వేషముగానీ, పాపములుగానీ, పరిహాసములుగానీ, పరనిందలుగానీ చేయటానికి మనము యేమాత్రము ముందంజ వేయము. ఆ విధమైన మార్గము ననుసరించాలి. ఉత్తమమైన కార్యములో మనము ప్రవేశించాలి. ఆదర్శవంతమైన కర్మలు ఆచరించాలి. మానవత్వములో ఏకత్వము మనము అభివృద్ధి గావించుకోవాలి. ఈనాటి మేధావులు ఏకత్వమును అనేకత్వముగా విభజించి చూస్తున్నారు. అనేకత్వములో ఏకత్వమును గుర్తించినటువంటి గుణవంతులు చాలా తక్కువగా ఉంటున్నారు. యీనాడు మనము అనేకత్వములో ఉన్న ఏకత్వమును గుర్తించాలి. అందరూ మానవులే! రూపనామములు వేరు వేరుగా ఉండవచ్చును. కానీ దైవతత్త్వము ఒక్కటే! చూడండి, యీ బల్బులు ఎక్కడెక్కడో ఎన్నెన్నో వేరువేరుగా కనుపిస్తున్నాయి. కాని, అన్నింటియందు ఉన్న కరెంటు ఒక్కటే అనే సత్యాన్ని గ్రహించాలి. ప్రతి మానవుడుకూడను ఒక బల్బువంటివాడే! ఒక

బల్బు డిమ్‌గా ఉండవచ్చును. ఒక బల్బు కాంతివంతముగా ఉండవచ్చు. కరెంటులో భేదము లేదు. మానవులనే బల్బులలో ఉండిన శక్తిసామర్థ్యములు తక్కువ, ఎక్కువ ఉండవచ్చును గానీ కరెంటు ఒక్కటిగానే ఉన్నాది. ఆ ఏకత్వమును మనం చూచుకోవాలి.

**స్వార్థమును మనము ఏనాడు త్యజించుదుమో ఆనాడే పరార్థము మనను వరిస్తుంది**

**మృత్పిండమేకం బహుభాండరూపం**
**సువర్ణమేకం బహుభూషణాని**
**గోక్షీరమేకం బహుధేనుజాత**
**ఏకం పరమాత్మా బహుదేహవర్తి**

ఒక్క దైవత్వమే సర్వులయందు ఉంటున్నది. క్రిష్టియన్ దైవము, ముస్లిం దైవము, హిందు దైవము, అమెరికా దైవము, పాకిస్తాన్ దైవము అని వేరువేరుగా లేరు. ఒక్కడే దైవము. 'ఒక్క సూర్యుండు సమస్త లోకములకు ఒక్కొక్కడై ఉండు'. ఇప్పుడు అమెరికాలోపల రాత్రి కాలముననుభవిస్తూ ఉంటారు. కానీ మన దేశంలో పగటి కాలముననుభవిస్తున్నాము. రాత్రి, పగలు ఆయా స్థానములకు చెందినటువంటివేగానీ, సూర్యుడు ఒక్కడే యిరువురికి. యిలాంటి ఏకత్వమును మనము భావించాలి. ఈనాడు మన దేశముయొక్క అభివృద్ధిని, మన దేశముయొక్క ఉన్నత స్థితిని, శ్రేయస్సును, మనము కోరలేకపోతున్నాము. కారణము ఏమిటి? స్వార్థము, స్వార్థము. ఈ స్వార్థము మనము ఏనాడు త్యజించుదుమో ఆనాడే పరార్థము మనను వరిస్తుంది.

**ఆచరణలోని అహంకారము, అనుభూతిలోని ఆసక్తి రెండూ వదిలితే త్యాగమే భోగము, భోగమే త్యాగము**

'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః'. మానవుడు చేయవలసినది త్యాగమే! నిత్యజీవితములో తెల్లవారిమొదలు రాత్రివరకుకూడను త్యాగమువల్లే యోగముగానీ, భోగముగానీ! దీనిని మనము గుర్తించుకోలేకపోతున్నాం. ఐతే, త్యాగములో యోగము ఎట్లా ఉంటుంది? యోగములో త్యాగము ఎట్లా ఉంటుంది? ఆచరణలోని అహంకారము, అనుభూతిలోని ఆసక్తి, రెండూ వదిలితే త్యాగమే భోగము, భోగమే

sri sathyasai vachanamrutam

త్యాగము. దీనికి భేదమే లేదు. కనుక, యీనాడు మానవత్వములో ప్రతి పనియందు అహంకారమును త్యజించాలి. ఫలితమునందు ఆసక్తిని విస్మరించాలి. దివ్యత్వమును విశ్వసించాలి. అదే మానవత్వమునకు ఉన్న ప్రధానమైన లక్ష్యము. ఈ భవనమునందు ప్రతి ఒక్కటికూడను కర్మలయొక్క ఫలితమే! యింజనీర్లు, పనివాళ్ళు, మేస్త్రీలు, ప్లంబర్లు వీరందరు నిర్వహించిన కర్మల ఫలస్వరూపమే యీ భవనము. లేకపోతే యీ భవనము ఏరీతిగా తయారైంది? కాబట్టి, కర్మలఫలమే ప్రతి రూపంకూడను. కర్మను మనం చక్కగా విచారించాలి. కర్మచేసే సమయములో మనం నవ్వుతూ నవ్వుతూ చేస్తున్నాం. కానీ, అనుభవించే సమయములో ఏడుస్తూ ఏడుస్తూ అనుభవిస్తున్నాం. అది సరికాదు. కర్మఫలము అనుభవించేటప్పుడుకూడను నవ్వుతూ నవ్వుతూ అనుభవించాలి. మన జీవితం ఎక్కడనుండి వచ్చింది? పుట్టే సమయములో 'కోహం,' 'కోహం' అని ఏడ్చినాము. ఏమిటి దీని అంతరార్థము. 'నేనెవరు?', 'నేనెవరు?' అని ఏడ్చినాము. ప్రతి పిల్లవాడుకూడను ఏడుస్తున్నాడు. కాని, దాని అంతరార్థమును గుర్తించటానికి తగిన ప్రయత్నం చేయటం లేదు. 'కోహం' అంటే నేనెవరని ప్రశ్న. అయితే పెరిగి పెద్దవాడయ్యేవరకుకూడను 'నేనెవరిని' అని ఏడుస్తుంటే మన జీవితముయొక్క అంతరార్థము ఏమిటి? మన జీవితముయొక్క గమ్యము ఏమిటి? కాదు, కాదు. 'కోహం' అని పుట్టినవాడు 'సోహం' అని చావాలి. నేనే దైవము అనే దివ్యమైన అనుభూతిలోకి రావాలి. అప్పుడే పుట్టినందుకు సార్థకము.

**భారతదేశమునందు పుట్టటమే మహాభాగ్యము**

దివ్యాత్మస్వరూపులారా! భారతదేశము చాలా పవిత్రమైనది. దివ్యమైనటువంటిది, నవ్యమైనటువంటిది. ఈ భారతదేశమునందు పుట్టటమే మహాభాగ్యము. ఏ ఒక్కటిగానీ మనము అనుకుంటే లభించేటువంటిది కాదు. అదే మనలను వెతుక్కొని వస్తూ ఉంటుంది. కోరినవన్నీ చేయటానికి వీలుకాదు. తలచినవన్నీ చెప్పటానికి వీలు కాదు.

**ఇది చేతు నది చేతు నింకెన్నియో చేతు**
**ననుచు నూహలు అల్లి అలసిపోకు**

**ఏ విత్తులను నాటి యిచ్చోట నుంటిరో**
**ఆ ఫలములే మీకు అందుచుండు**
**విత్తనం బొకటైన వేరైన ఫలములు**
**సమకూరుటది యెట్లు సాధ్యమగును?**
**తెలివితేటలు మరి బలమెంత యుండిన**
**కర్మ దాటగజాలు ఘనుడు లేడు**
**ఎన్ని చేసిన నవియన్ని యెంచియెంచి**
**మంచినైనను చెడునైన త్రుంచకుండ**
**బ్రహ్మ మీకిచ్చి పంపును బరువుమాల**
**కర్మ లన్నియు చేర్చిన కంఠమాల.**

ఏమాత్రము సాధ్యము కాదు. మామిడి విత్తనము నాటి నిమ్మఫలము కావాలంటే లభిస్తుందా? రాదు. వేప విత్తనము నాటి మామిడి ఫలము కావాలంటే వస్తుందా? కాదు, వేపకాయలే వస్తాయి. కనుక మానవత్వములో మనము చేసే కర్మలు పవిత్రమైనవి, దేశ శ్రేయస్సు కోరేటువంటివి మరియు పలువురికి ఆనందము కలిగించేవి చెయ్యాలి. ఒక్క చిన్న విషయము. మీరు వేరుగా భావించకూడదు. పోయిన సంవత్సరము మన ప్రధానమంత్రి పి.వి.నరసింహరావు రాజకీయములనుండి విరమించుకొని శారీరకంగా, మానసికంగా, ప్రశాంతముగా కాలము గడపాలని సంకల్పించుకున్నాడు. దానికి తగిన ఏర్పాట్లన్నీ చేసుకున్నాడు. అతడు ఏనాడు తాను ప్రధానమంత్రి కావాలని ఆశించలేదు. దానికి తగిన ప్రయత్నాలు చేయలేదు. కానీ అదే వరించింది. అదే అతన్ని ఆశించింది. అలాంటి యోగములు కొంటే వచ్చేవి కాదు.

**అడుగకువె ఓ మనసా**
**అడుగుకొలది అది అడుగున పడునని**
**అడుగకున్న పని వడిగానగునని ॥అడు॥**
**అడుగని శబరిని ఆదరించడే**

srisathyasaivachanamrutam

**అడుగక తనకై మడియు జటాయువు**
**కడకునేగి సద్గతి కల్గించదే ॥అడు॥**

అతను అడుగ లేదు. కనుక, ఏ విధంగాకూడను అదృష్టముగాని, దురదృష్టము గానీ, మంచిగానీ, చెడ్డగానీ అదే వచ్చి వరిస్తుంటాది.

**ఉపకారము చేయడం చేతకానప్పుడు ఊరకే ఉండాలి; అపకారంమాత్రం చేయకూడదు**

దివ్యమైన భావములు మనలో రాకుండా ఉండటానికి మనలో ఒకటి అడ్డు తగులుతూ ఉంటున్నాది. అది ఏమిటి? 'తనదులోని తప్పులు లక్షలు దాచుకొనుచు, పరులయందున్న నలుసును పెంచుచుండు.' అనగా యితరులలో నున్న తప్పును పెద్దగా పెంచేస్తూ ఉంటారు. తనలోనున్న తప్పులు లక్షలు ఉండినా దాచుకుంటాడు. పరులలో ఉన్న ఏ చిన్న తప్పయినా సరే ఎక్కువగా పెంచుతారు. ఆ దుర్బుద్ధులు యీనాడు పోవాలి. భారతదేశములో పుట్టిన ప్రతి ఒక్క వ్యక్తి యీ దుర్బుద్ధికి దూరంగా ఉంటుండాలి. అప్పుడే మనము దేశమును ఉద్ధరించినవారమవుతాము. ఉపకారము చేయుటకు మనకు చేతకానప్పుడు నోరు మూసుకు కూర్చుంటే అదే పెద్ద ఉపకారము. అపకారము చేయటానికి ప్రయత్నించకూడదు. చేసేవారికి అడ్డు తగలకూడదు. ఈనాడు భారతదేశము ఎన్నో సమస్యలతో కూడి ఉంటున్నది. మన నరసింహారావు ప్రధానమంత్రి బాధ్యతలు తీసుకున్న దగ్గరనుంచికూడను పర్వతాల మాదిరి వస్తున్నాయి, సమస్యలు. కానీ తను శాంతంగా, సహనంగా, సరైన భావములో విచారణ చేసి సర్వులను సంప్రదించి సరైన నిర్ణయములు తీసుకుంటున్నాడు. అది సాధ్యము కాదు, యింత పెద్ద ప్రపంచములో. ఒక్క పుష్పము హారము కాదు కదా! అనేక పుష్పాలు చేరుతే హారము తయారౌతుంది. అలాంటి దానికి మనం చేదోడువాదోడుగా ఉండి దేశముయొక్క అభివృద్ధిని, దేశముయొక్క పేరు ప్రతిష్ఠలను నిలుపుకోటానికి తగిన కృషి చేయాలి. ఎన్నో వస్తుంటాయి, సమస్యలు కష్టములు. Pleasure is an interval between two pains. రెండు బాధల మధ్యలోనే ఒక సుఖము ఉంటుంది. ఎయిర్‌కండిషన్ రూములో 24 గం॥లు కూర్చుంటే ఏసి విలువకూడా తెలియదు. ఎండలో రెండు గంటలు చుట్టి వచ్చినప్పుడే ఏసి విలువ తెలుస్తుంది. కష్టముల వెంటనే సుఖములుకూడా ఉంటుంటాయి. రోడ్డు వేస్తుంటారు. తిన్నగా వేయరు.

sri sathyasai vachanamrutam

రోడ్డు మధ్యలో ఎగుడుదిగుడుగా పెడతారు. ఎందుకోసం? స్టీరింగ్ కంట్రోలుకోసం చేస్తుంటారది.

**భారతదేశములో ఉన్న సంస్కృతి, సంస్కారములు మరి ఏ యితర దేశమునందు లేవు**

అదే విధముగానే కొన్ని కష్టనష్టములు వస్తుంటాయి, యీ ప్రపంచములో! వీటిని తట్టుకొని నెట్టుకొని సాధిస్తూ వస్తున్నాడు, నరసింహారావు. దానికి తగిన ప్రోత్సాహఉత్సాహాలు అందరుకూడను యివ్వాలి. అన్ని రాష్ట్రములవారు సహకరించాలి. అన్ని పార్టీలవారుకూడను సహకరించాలి. ఎవరిది దేశము? మన దేశమే! ఈ సత్యమును ఎవరుకూడను విస్మరించరాదు. సత్యమనేది కులమతములకు సంబంధించినది కాదు. సత్యము సర్వులకు ఒక్కటే, ఒక్కటే! త్రికాలాభాద్యమైనది సత్యము. యిది బ్రాహ్మణ సత్యము, యిది శూద్ర సత్యము, యిది కమ్మ సత్యము, యిది రెడ్ల సత్యము అని లేదు. అందరికి ఒకే సత్యము. 'సత్యంనాస్తి పరోధర్మః.' ఆ సత్యమును రక్షించాలి. ఈనాడు మనం దేశముయొక్క గౌరవమును, ప్రతిష్టను నిల్పుకోటానికి వీలులేకుండా ప్రయత్నం చేస్తున్నాం. అది చాలా తప్పు.

**ఇది నాదు మాతృదేశము**
**ఇది నా ప్రియ మాతృభాష ఇది నా మతమం**
**చెదగొట్టి నుడువనేరక**
**బ్రదికిన జీవి యొకడైన వసుధను గలడా!**

మన దేశముయొక్క గౌరవమును మనం రక్షించుకోవాలి. అందరుకూడను ఏకం కావాలి. అదే వేదం చెప్పింది.

**సహనా వవతు**
**సహనౌ భునక్తు**
**సహవీర్యం కరవావహై.....**

అంటే ఏమిటి?

sri sathyasai vachanamrutam

**కలసిమెలసి తిరుగుదాం, కలసిమెలసి పెరుగుదాం!**
**కలసిమెలసి కలిమిచెలిమి బలముగుణము పెంచుదాం!**
**కలసిమెలసి తెలుసుకొన్న తెలివిని పోషించుదాం!**
**కలసిమెలసి కలిమితోడ చెలిమిగ జీవించుదాం!**

ఈ భావము ఎంత గొప్పది, చూడండి! ఈనాడు యిది ఉందా, భారతీయులలో? యిది ఉంటుంటే ఇతర దేశములన్నిటికి భారతదేశము లైట్‌హౌస్ మాదిరిగా ఉంటుంది. భారతదేశములో ఉండిన అనుకూలములుగానీ, భారతదేశములో ఉన్న సంస్కృతిగానీ, భారతదేశములో ఉన్న సంస్కారముగానీ ఏ యితర దేశమునందు లేదు. కనుకనే 'ఎన్న భారతే తన్న భారత' అన్నారు. భారతదేశము ఎంత పవిత్రమైనటువంటిది! అలాంటి పవిత్రమైన భారతదేశముయొక్క దివ్యత్వాన్ని యీనాడు విస్మరించి తమ స్వార్థము, స్వప్రయోజనముల నిమిత్తమై ప్రయత్నాలు చేయటంచేతనే దేశము అనేక విధములైన కష్టములకు, నష్టములకు, దుఃఖములకు గురి కావలసి వచ్చింది.

ప్రేమస్వరూపులారా! ఏ కార్యమైనా సహనంతో ఒకరినొకరు సరిగా అర్థము చేసుకొని ఆచరించినప్పుడు సాధించటానికి వీలు కానటువంటిది ఒక్కటికూడను భారతదేశములో లేదు. ఏమైనా చేయవచ్చు. సహనం కావాలి! దానికి తగిన సహకారముకూడా ఉంటుండాలి! కాని, ఈనాడు అవేమీ లేవు. ఒకరు yes అంటే ఒకరు no. యింకొకరు yes అంటే మరొకరు no. నిజానికి, హృదయానికి ఈ no, yes లు ఉన్నాయా? లేదు. ఏదో ఒకరు మంచి చేశారంటే మరొకరు దానికి no అని అడ్డు తిరుగుతున్నారంటే ఏమి ప్రయోజనం? చెప్పండి. అది మంచా, చెడ్డా అని విచారణ చెయ్యాలి. అందరూ కలసిమెలసి మెలగాలి. భారతదేశముయొక్క ప్రభావము, దివ్యశక్తి ఎంతైనా ఉంటుండాది! కానీ మనం దానిని తెలుసుకోటానికి ప్రయత్నం చేయటం లేదు. ఈనాడు ప్రతి దానికి అనుభవం కావాలంటాము. ఏదైనా ఒక దానిని నమ్మాలంటే మనకు అనుభవం కావాలి. అనుభవమైన తరువాతనే నమ్ముతానంటారు. పిచ్చి పని కదా, యిది! ఎంత తెలివి తక్కువ మాట! 'నాకు ఈత వచ్చేంతవరకు నేను నీటిలో పడను' అంటే, ఈత ఎట్లా వస్తుంది? నీటిలో పడాలి, ఈత

sri sathyasai vahini / vachanamrutam

నేర్చుకోవాలి. ఆ విధంగా కాకుండా మూర్ఖత్వంగా మనం పోతున్నాము.

**ఈనాడు మనుషులు మారుతున్నారుగాని, మనసులు మారటం లేదు**

దివ్యాత్మస్వరూపులారా! భారతీయుల హృదయము చాలా విశాలమైనది. చాలా ధన్యమైనది. అలాంటి దాంట్లో యీ జాతి మత భేదములు నిండి మనుషులమధ్య దూరమును పెంచుతున్నాయి. అందువలన ఈనాడు మనం, మన నీతిని నిజాయతిని పెంచుకొని, 'మన అందరి జాతి ఒక్కటే! అదే మానవజాతి,' అని ప్రపంచానికి చాటి చెప్పవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. 'There is only one caste, the caste of humanity; there is only one religion, the religion of Love; there is only one language, the language of the heart' అని ప్రపంచానికి బోధించాలి. యీ మూడింటిని మనం ఆధారంగా తీసుకుంటే ఎంత అభివృద్ధినైనా మనం సాధించవచ్చును. కనుక, యీ భావాన్ని మీరు హృదయంలో పెట్టుకొని ప్రతి మానవుడుకూడను తన కర్తవ్యమును తాను నిర్వర్తించి తన విద్యుక్త ధర్మాన్ని తాను ఆచరించాలి. యిదీ యీనాడు మనం నేర్చుకోవలసినది! భారతదేశము అనేక విధములైన సమస్యలతో నిండి ఉంటున్నది. కానీ, ఒక్క విషయాన్ని మాత్రం మీరు చక్కగా గుర్తించాలి. ఏవో కొన్ని ప్రమాదములు వస్తాయని మీరు భయపడుతున్నారు. న్యూస్‌పేపర్సులోను, ఇంకా ఇతరత్రా కొన్ని విధమైన వార్తలు వస్తున్నాయి. అయితే, భారతదేశమునకు ఎప్పటికి ఏ విధమైన భయము లేదు, లేదు, లేదు. యివన్నీ కేవలం ఏదో ఒక విధమైన మార్పులు. పరిణామమునకు ఒక విధమైన సూచనలు. చివరకు ఇవన్నీ మంచి పరిణామమునకే దారి తీస్తాయి. ఐతే, మానవునియొక్క మనస్సు మారాలి. ఈనాడు మనుషులు మారుతున్నారుగానీ మనసులు మారటం లేదు. గుడ్డలు మారుస్తున్నారుగానీ, గుణాలు మారటం లేదు. ఏమి ప్రయోజనం చెప్పండి? గుణములు మారాలి, మనసులు మారాలి. అప్పుడే అన్నీ మారినట్టవుతుంది.

**వ్యక్తి, సమాజం రెండూ అవినాభావసంబంధము గలవి, అన్యోన్యాశ్రయమైనవి**

మనలో ఉండే ద్వేషాలుకానీ, అసూయగానీ, అహంకారముగానీ యివన్నీ పశులక్షణాలు. మానవులకు ఉండవలసిన లక్షణములు శాంతి, సహనము, ప్రేమ, దయ, త్యాగము. ఈ

srisathyasaivachanamrutam

మానవతా విలువలు మనము యీనాడు పెంచుకోవాలి. కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము యివన్నీ పశులక్షణములు.

**ఆహార నిద్రా భయ మైథునాని సమానమేతత్పశుభిర్నరాణామ్**
**జ్ఞానం నరాణాం అధికం విశేషః జ్ఞానేన శూన్యః పశుభిస్సమానః.**

మనలో ఉండిన మానవత్వం మనం తల్చుకోవాలి. తెల్లవారి లేచినది మొదలు 'నేను మానవుడు, నేను మానవుడు' అని అహంకారపడినంతమాత్రమున చాలదు. నీవు మానవుడనుకుంటున్నావు; కానీ, చేసే పనులు ఎట్లాంటివి? పశువు చేసే పనులు చేస్తున్నావు. నేను మానవుడనేది అర్ధము సత్యము. రెండవ అర్ధ సత్యమేమిటి? 'నేను పశువును కాదు, నేను మానవుడు. నేను పశువును కాదు, నేను మానవుడు' అని ప్రతిక్షణం నిన్ను నీవు గుర్తుచేసుకోవాలి. ఈ రెండింటిని చేర్చినప్పుడే పూర్ణ మానవుడౌతాడు. ప్రతి మానవుడుకూడను యీ విధమైన విచారణ చేయాలి. ఈనాడు మన దేశముయొక్క పరిస్థితి ఎలా ఉంది? దేశం బాగుంటేనే కదా నీవు బాగుండటం! నీవు మారుతేనే సమాజం మారుతుంది. సమాజము మారితేనే నీవు మారుతావు. ఈ రెండు అవినాభావ సంబంధములు, అన్యోన్య ఆశ్రయములు. మొట్టమొదట మీరు మారాలి. మీరు మారి దేశమును మార్చటానికి ప్రయత్నించాలి. ఏ విధంగా మారాలి? ప్రేమతత్త్వము ఒక్కటే దీనికి ఆధారం. ప్రేమను పెంచుకోవాలి. పాతది, రోతది గుణములు మనం దూరం చేయాలి. నూతనమైన, ఉత్తేజమైన, పవిత్రమైన, దివ్యభావాలు పెంచుకోవాలి. అప్పుడే అన్ని విధాలా దేశము అభివృద్ధి గాంచటానికి అవకాశము ఉంటుంది. ఈనాడు మన ప్రధానమంత్రి చాలా సమస్యలలో ఉంటున్నప్పటికిని ధైర్యముతో, భగవత్ విశ్వాసముతో, నైతిక బలముతో తాను సాధించటానికి ప్రయత్నం చేస్తున్నాడు. దానికి తగినట్లుగా మనంకూడను సహాయం చేయాలి. దైవసహాయం ఉంటున్నాది. మానవ సహాయంకూడా కావాలి. దైవము అనేది ఒక దారము వంటిది. దానికి పూలన్నీ చేర్చాలి కదా! అప్పుడే హారము ఒక్కటిగా కనుపిస్తుంది. పువ్వులు వేరు, వేరు. దారము ఒక్కటే! దైవత్వం ఉంటుంది. మీరందరు

srisathyasaivachanamrutam

ఒకరికొకరు సహకరించి అన్ని రాష్ట్రములవారు, అధికారులుకూడను దీనికి సహకరించి చేదోడు వాదోడుగా ఉన్నప్పుడు భారతదేశము ఎంతైనా అభివృద్ధికి వస్తుంది. ఎంతైనా ఆదర్శమును అందించటానికి అవకాశము ఉంటుంది.

**జీవతత్వమును దైవతత్త్వముతో చేర్చటమే లగ్నము**

ప్రేమస్వరూపురాలా! ఈ భవనము హైదరాబాద్‌లో కట్టటము కేవలము విశ్వకళ్యాణము నిమిత్తమే! దీనిని మీరు విశ్వకళ్యాణమందిరముగా భావించాలి. విశ్వ కళ్యాణము ఏ రీతిగా ఉంటున్నాదంటే అందరు చేరటమే! కళ్యాణమంటే ఏమిటి? లగ్నపత్రిక చేస్తున్నామంటారు. లగ్నమంటే ఏమిటి? అమ్మాయి మనస్సు, అబ్బాయి మనసులో చేరటము; అబ్బాయి మనసు, అమ్మాయి మనస్సులో చేర్చటము. యిదే లగ్నం. 'నాకు ధ్యానములో మనస్సు లగ్నం కావటం లేద'ంటారు. మన జీవతత్వమును దైవతత్త్వముతో చేర్చటమే లగ్నము. కనుక, మానవులందరు ఒకరికొకరు అంతా ఏకము కావాలి. అలా ఏకమైనప్పుడే ఎంత పనైనా చేయవచ్చును. ఐదు వ్రేళ్లున్నాయి. ఒక్కొక్క వేలు ఒక్కొక్క పని చేయాలంటే వీలు కాదు. ఐదు వ్రేళ్లు ఏకంగా చేరితే ఎంత పనైనా చేయవచ్చు. అందుకు ఐకమత్యము చాలా అవసరము.

ప్రేమస్వరూపులారా! ఈనాడు మనం cooperation కు దూరంగా ఉంటున్నాం; operation సిద్ధంగా ఉంటున్నాం. అదికాదు మనం చేయవలసింది. ఐకమత్యము కావాలి.

> **ఐకమత్యమె సుఖమందరి క్షేమంబు**
> **ఎంతకార్యమైన నెగ్గవచ్చు**
> **చిన్న చీమలన్ని సర్పంబునున్‌బట్టి**
> **చంపుచుండలేదె జగతియందు.**

చిన్న చిన్న చీమలు చేరి పెద్ద సర్పమును పట్టటం లేదా! అదే విధంగా చిన్న వారైనప్పటికి ఐకమత్యంగా చేరితే ఎంతటి ఘనకార్యమైనా మనం సాధించవచ్చు. ఈ ఐకమత్యమునకు ప్రయత్నం చేయండి. ఐకమత్యంచేత ఎంతటి కార్యమైనా చేయవచ్చు. ఈనాటినుండైనా స్వార్థమును త్యాగము చేసి అందరు కలసి మహా వృక్షమువంటి మీ ప్రధానమంత్రికి యీ

sri sathyasai vachanamrutam

కొమ్మలు, రెమ్మలు ఒకదానికొకటి సహాయంగా ఉంటుంది మీమీ కర్తవ్యములు మీరు నిర్వర్తిస్తే మంచి ఫలమునందిస్తుంది. దీని ఛాయలోపల భారతీయులందరు ఎంతైనా ఆనందమును అనుభవించగలరు.

**అనేకత్వముగా ఉండినదానిని ఏకత్వముగా చేర్చటమే నమస్కారములోని అంతరార్థము**

ప్రేమస్వరూపులారా! నా సుదీర్ఘ ప్రసంగాన్ని విరమిస్తూ ముఖ్యంగా అందరూ ఒక తల్లిబిడ్డలుగా అన్యోన్యంగా ఐకమత్యంగా జీవించాలని మరొక్కమారు చెపుతున్నాను. దేహాలు వేరు వేరుగా ఉంటుంటాయి. కానీ దైవము ఒక్కడే! మీరందరు ఆ దైవముయొక్క బిడ్డలమని భావించి, అందరూ సోదర సోదరీమణులుగా విశ్వసించి ఒకరికొకరు సహాయంగా జీవించాలి. ఈనాడు మీరు ఒకరినొకరు Hellow, Hellow అని పలకరించుకుంటున్నారు. కాని, లోపలంతా hollow! బైకి 'నమస్కారమండి!' అంటారు. కాని, లోపల ద్వేషాలు. యిది మంచిది కాదు. నమస్కారము అంటే ఏమిటి దీని అంతరార్థము? ఈ ఐదు, ఆ ఐదు రెండింటిని చేర్చాలి. అదే నమస్కారము. అనేకత్వముగా ఉండిన దానిని ఏకత్వముగా చేర్చటమే నమస్కారము. ఇదే భారతీయ సంస్కృతియొక్క తత్త్వమని మనం చక్కగా గుర్తించాలి. వ్యక్తిగత ద్వేషములు దూరము చేయాలి. సమిష్టి అయి దేశంయొక్క, సమాజంయొక్క క్షేమాన్ని మనం దృష్టిలో పెట్టుకోవాలి.

నిజముగా దక్షిణాదినుండి మన ఆంధ్రుడు ప్రధానమంత్రి గావటమే ఒక పెద్ద అదృష్టమైనదిగా భావించాలి. దానికి మనమెంతైనా గర్వించి, ఆనందించి, దీనిని అభివృద్ధిపరచుకొని, యింకా కొంతకాలం వీరిని నిల్పి, యింకా వీరిద్వారా భారతదేశానికి ఎంతైనాకూడా వీరి సేవలు అందేలా మనం కృషి చేయాలి. అసూయచేతను లేక యింకే విధమైన ద్వేషముచేతను వీరిని దింపటానికి మనం ప్రయత్నించకూడదు. నిజంగా ఆ విధంగా చేసేవాడు మానవుడే కాడు! ఏ దేశమైతే మనకేమి? ఏ కాలమైతే మనకేమి? ఎవరైతే మనకేమి? దేశం అభివృద్ధి కావాలి. మన భారతదేశం బాగుపడాలి. అందుకొరకు మీరు ఎట్టి భేదములకు అవకాశం లేకుండా, ప్రధానమంత్రికి తగిన సహాయ, సహకారములు అందించాలి. ఆయన ఎంతో శ్రమ పడ్తున్నాడు. మీకు తెలీదు. అందరినీ సంతోష పెట్టాలని ప్రయత్నిస్తున్నాడు.

srisathyasaivachanamrutam

ఎవరినీ బాధ పెట్టాలని అతనికి ఏమాత్రం లేదు. చేతికి చిక్కిన, దక్కిన యీ అవకాశంతో ఆయన చక్కని కీర్తిని సాధించాలి. దేశానికి ఆదర్శాన్ని అందించాలనే సత్‌సంకల్పాలు అతనిలో ఎన్నో ఉంటున్నాయి. అది మీరు ఎవరూ గమనించరు. రాత్రి నిద్రించే సమయంలో యిదే యోచన చేస్తుంటాడు. అలాంటి వ్యక్తికి మీరు శక్తిసామర్థ్యాలు అందించాలి. అందుకు దైవానుగ్రహం దండిగా ఉంటున్నది. కాని, పురుష ప్రయత్నంకూడా కొంత కావాలి. ఈ రెండూ చేరినపుడే, నెగెటివ్, పాజిటివ్ చేరినట్లుగా కరెంట్ చక్కగా ఉపయోగించుకోవచ్చు. మీరందరూ మీమధ్య ఉన్నటువంటి భేదాలను మర్చిపోయి ఐకమత్యంచేత యీ దేశంయొక్క కీర్తిని నిలబెట్టాలి. చిరకాలమునుండీ భారతదేశంయొక్క కీర్తి ఎంతో వ్యాప్తి చెందినటువంటిది. భారతదేశము నైతికంగా, ధార్మికంగా, ఆధ్యాతికంగా ఎంతో రాణించినటువంటిది. కాని భారతీయులు యీనాడు లౌకికంగా, భౌతికంగా పరస్పర ద్వేషాలను పెంచుకుంటూ నైతికంగా పూర్తిగా దిగజారిపోతున్నారు. అది రాకూడదు. నైతికంగా పైకి రావాలి. అదే మన సంస్కారము. అదే నీతి, నిజాయితీ!

ప్రేమస్వరూపులారా! మీరు వేరుగా భావించుకోకుండా దేశముయొక్క కళ్యాణం కోసమని అందరు ఐకమత్యంగా ఉండి యీనాడు యిది ఒక పెద్ద కళ్యాణం జరిగినట్లుగా భావించుకుని పాతవన్నీ తుడిచిపెట్టి నూతనమైన భావాలను, ఉన్నత భావాలను అభివృద్ధి గావించుకోవాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను.

**(తేదీ 29-08-1992న హైదరాబాద్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam